

మొదటి మొక్కు రాజన్నకే..
మేడారం సమ్మక్క, సారలమ్మ జాతరకు వచ్చే భక్తులు ముందు వేములవాడ రాజన్నకే మొదటి మొక్కు చెల్లిస్తారు.
- 8లో▸



చదువుల తల్లికి జేజేలు
కాళేశ్వరాలయం అనుబంధ దేవాలయం సరస్వతీ అమ్మవారి ఆలయంలో బుధవారం వసంత పంచమి వేడుకల సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.
- 10లో▸

గరిష్టం/కనిష్టం
$33^0/17^0$

వాతావరణం
జిల్లాలో ఉదయం వాతావరణం చల్లగా ఉంటుంది. మధ్యాహ్నం సమయంలో ఎండతో పాటు ఉక్కపోత ఉంటుంది. సాయంత్రం వేళ ఆహ్లాదకరంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

యువత అవకాశాలు అందిపుచ్చుకోవాలి



స్టేషన్‌ఘన్‌పూర్: ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు కల్పించే ఉపాధి అవకాశాలను ఎస్సీ, ఎస్టీ యువత అందిపుచ్చుకోవాలని జిల్లా ఉపాధి కల్పన అధికారి ఉమారాణి అన్నారు. తెలంగాణ ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ప్రొడక్టివిటీ కౌన్సిల్ వారిచే ఎస్సీ, ఎస్టీలకు నైపుణ్య శిక్షణపై బుధవారం ఘన్‌పూర్‌లో వర్క్‌షాప్ నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ.. యువత తమలోని ప్రతిభను పెంపొందించుకునేందుకు ఇలాంటి వర్క్‌షాపులు దోహదపడతాయన్నారు. అనంతరం శిక్షణ పొందిన వారికి ధ్రువీకరణ పత్రాలు అందించారు. కార్యక్రమంలో ఏపీపీసీ కో–ఆర్డినేటర్ సత్యం, శిక్షణ నిర్వాహకులు బైరపాక వినోద్ తదితరులు పాల్గొన్నారు.

నియామక పత్రాలు అందుకోవాలి



జనగామ: కానిస్టేబుల్‌గా ఎన్నికైన అభ్యర్థులు సీఎం అనుముల రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలు అందుకోవాలని అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్ అన్నారు. బుధవారం హైదరాబాద్‌కు బయల్దేరిన జిల్లాలోని 199 మంది కానిస్టేబుల్ అభ్యర్థులు నాలుగు బస్సులను జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో డీపీఓ రంగాచారి, డీఈఓ రాము, డీఏఓ వినోద్‌కుమార్, డీఎస్‌ఓ రోజారాణి, బీసీ వెల్ఫేర్ అధికారి రవీందర్, డీఎంఓ నరేందర్ రెడ్డి, ఎస్సై శ్వేత పలువురు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి
పట్టణంలోని అన్ని వాటర్ ప్లాంట్ల చుట్టూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవా లని అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్ అన్నారు. బుధవారం పట్టణంలోని 13, 16 వార్డుల్లో శానిటేషన్ పనుల్ని పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ చంద్రమౌళి తదితరులున్నారు.

సోమేశ్వరాలయంలో వసంత పంచమి వేడుకలు



పాలకుర్తి టౌన్: మండల కేంద్రంలోని శ్రీసోమేశ్వర లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో బుధవారం వసంత పంచమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా చండికాదేవి అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున చండికాదేవిని దర్శించుకొని చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ భాగం లక్ష్మీప్రసన్న, అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

బంద్‌కు సీపీఐ పూర్తి మద్దతు

జనగామ: దేశవ్యాప్తంగా కార్మిక రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని కార్మిక హక్కులను కాపాడాలని ఈనెల 16న చేపట్టిన బంద్‌కు సీపీఐ పూర్తి మద్దతు తెలుపుతోందని సీపీఐ జిల్లా కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సీహెచ్.రాజారెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కార్యాలయంలో చొప్పరి సోమయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ. 16న ఆర్టీసీ చౌరస్తా నుంచి ర్యాలీ తీస్తున్నట్లు హమాలీ, ఆటో, భవన నిర్మాణ, అన్ని వర్గాల కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర సభ్యురాలు పాతూరి సుగుణమ్మ, జిల్లా నాయకులు ఆకుల శ్రీనివాస్, ఆది సాయన్న, మంగళంపల్లి జనార్దన్, రావుల సదానందం, జూవారి రమేశ్, యాదగిరి, సోమయ్య, ప్రశాంత్, పాండు, కుమారస్వామి, యాకూబ్, రాములు పలువురు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఇంటర్ ప్రాక్టికల్స్

జనగామ రూరల్: జిల్లా వ్యాప్తంగా ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు కొనసాగుతున్నాయి. బుధవారం ఉదయం జరిగిన పరీక్షకు మొత్తం 436 మంది విద్యార్థులకుగాను 13 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షకు 126 మందికిగాను ఒక విద్యార్థి మాత్రమే గైర్హాజరయ్యారు. ఆయా పరీక్ష కేంద్రాలను జిల్లా ఇంటర్ విద్యాధికారి బైరి శ్రీనివాస్, డీఈసీ సభ్యులు అంజనేయరాజు సందర్శించారు.

రూ.27.43 కోట్లు

మున్సిపల్ అంచనా బడ్జెట్
- నేడు మున్సిపల్ బడ్జెట్ సమావేశం
- 2024–25 ఆదాయం, ఖర్చు రూ.11.77 కోట్లు
- గ్రాంట్స్ రూ.15.66 కోట్లు
- మిగులు అంచనా రూ.71.92 లక్షలు



జనగామ మున్సిపల్ కార్యాలయం

జనగామ: జనగామ పురపాలిక బడ్జెట్‌కు నేడు ఆమోద ముద్ర పడనుంది. ఈసారి భారీ బడ్జెట్‌కు రూపకల్పన చేశారు. గత సంవత్సరం మిగులుతో పాటు ప్రభుత్వం నుంచి వచ్చే గ్రాంట్స్ కలుపుకుని.. అంచనా బడ్జెట్ తయారు చేశారు. ఇందు లో పట్టణ అభివృద్ధితో పాటు తదితర పనులకు ప్రాధాన్యాన్నిచ్చారు. గురువారం చైర్‌పర్సన్ పోకల జమునలింగయ్య అధ్యక్షతన జరగనున్న కౌన్సిల్ సమావేశంలో 2024–25 బడ్జెట్‌కు ఆమోదం లభించనుంది. జనగామ పురపాలిక 2024–25 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌కు పురపాలిక అధికారులు సిద్ధం చేశారు. వార్షిక అంచనా బడ్జెట్‌లో ఆదాయంతో పాటు గ్రాంట్స్ కలుపుకుని రూ.27.43 కోట్లతో కౌన్సిల్ ముందు ప్రవేశపెట్టనున్నారు.

మిగులు బడ్జెట్ కలుపుకొని..
2023–24 మిగులు బడ్జెట్ ముగింపు నిల్వను కలుపుకుని ప్రస్తుత బడ్జెట్‌ను సవరించారు. పట్టణ సుందరీకరణ, మురికివాడల అభివృద్ధి, ఉద్యోగులు, సిబ్బంది వేతనాలు, గ్రీన్ బడ్జెట్ (10శాతం), ప్రజా అవసరాలు, పార్కుల అభివృద్ధి, వార్డుల్లో చేపట్టే అభివృద్ధి తదితరాల కోసం బడ్జెట్‌లో మున్సిపల్‌కు వచ్చే ఆదాయంలో ఖర్చు కింద చూపిస్తున్నారు. ఈఏడాది అంచనా ఆదాయం రూ. 11.77 కోట్లు చూపిస్తుండగా.. రూ.71.90 లక్షలు గతేడాది మిగులుతో మొత్తం రూ.12.48 కోట్లుగా లెక్కించారు. కాగా.. అంచనా క్యాపిటల్ (గ్రాంట్స్) ఆదాయం రూ.15.66 కోట్లు వచ్చే అవకాశం ఉన్నట్లుగా బడ్జెట్ నివేదికలో పేర్కొన్నారు.

ఆదాయ అంచనా బడ్జెట్ ఇలా..
మున్సిపల్‌కు ఆస్తి, అసైన్డ్‌పన్ను, రెమ్యూనరేటివ్ ఎంటర్‌ప్రైజెస్ రెంటల్, ప్రజారోగ్యం–పారిశుద్ధ్య విభాగం, పట్టణ ప్రణాళిక తదితర శాఖల ద్వారా 11.77 కోట్ల ఆదాయం వస్తుందని అంచనా వేశారు. గతేడాది కంటే రూ.1.96 కోట్లు అదనంగా చూపించారు. క్యాపిటల్ (నాన్ ప్లాన్, ప్లాన్, ఇతర గ్రాంట్స్) ద్వారా రూ.15.66 కోట్ల బడ్జెట్‌లో రానున్నట్లు చూపిస్తున్నారు. ఇందులో నాన్‌ప్లాన్ గ్రాంట్స్ రూ.3.70 కోట్లు, ప్లాన్‌గ్రాంట్స్ రూ.35 లక్షలు, ఇతర గ్రాంట్స్ రూ.11.61 కోట్ల నిధులు రానున్నాయి.

రాబడి ఎలా?
జనగామ మున్సిపల్ 2023–24 వార్షిక అంచనా, మిగులు, గ్రాంట్స్ బడ్జెట్ రూ.20.78 కోట్లకు ఆమోదం తెలిపారు. ఈసారి మిగులు రూ.71.90 లక్షలు కలుపుకుని రూ.27.43 కోట్లతో కౌన్సిల్ ముందుకు తీసుకెళ్తుండగా.. రూ. 6.65 కోట్ల బడ్జెట్ పెరిగింది. ఇందులో ఆస్తి పన్ను రూపంలో గత ఏడాది రూ. 4.93 కోట్లు ఉండగా.. ఈసారి రూ.5.14 కోట్లుగా చూపిస్తుండగా, అదనంగా రూ.21 లక్షలకు పెరిగింది. నాన్ ట్యాక్స్ వనరుల ద్వారా రెమ్యూనరేటివ్ ఎంటర్‌ప్రైజెస్ రెంటల్ ద్వారా గతేడాది రూ.80.60 లక్షలు ఉండగా.. ఈ ఏడాది రూ.1.4 కోట్లకు పెరగనుంది. ప్రజారోగ్యం, పారిశుద్ధ్య విభాగం శాఖ ద్వారా రూ.26.50 లక్షలు.. కాగా రూ.34.50లక్షలు, పట్టణ ప్రణాళిక విభాగం ద్వారా రూ.3.7 కోట్లు ఉండగా.. ప్రస్తుత బడ్జెట్‌లో రూ.4.56 కోట్లు, ఇంజనీరింగ్ విభాగంలో రూ.1.51 కోట్లు ఉండగా, ఈసారి రూ.67.60 లక్షలకు తగ్గింది.

ఖర్చు ఇలా...
గతేడాది కంటే ప్రస్తుత వార్షిక సంవత్సరంలో ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌లో ఖర్చు పెరిగింది. ప్రస్తుతం ఆదాయం మిగులుతో కలుపుకుని రూ.12.48 కోట్లు కాగా.. ఖర్చు రూ.11.77 కోట్లుగా బడ్జెట్ నివేదికలో చూపిస్తున్నారు. ఇందులో ఉద్యోగులు, సిబ్బంది వేతనాలు రూ.4.50 కోట్లు, ప్రజారోగ్య, పారిశుద్ధ్యానికి సంబంధించి రూ.1.67 కోట్లు, విద్యుత్ చార్జీలు రూ.79 లక్షలు, రుణాల చెల్లింపుల కోసం రూ.20 లక్షలు, 10 శాతం గ్రీన్ బడ్జెట్ (సీపీఎఫ్, ఎంజీఎఫ్) రూ.1. 54 కోట్లు, ఇంజనీరింగ్ విభాగం నిర్వహణ కోసం రూ.1.30 కోట్లు, జనరల్ అడ్మినిస్ట్రేవ్ రూ.1.08 కోట్లు, పట్టణ ప్రణాళిక వ్యయం రూ.10 లక్షలు, ప్రజావసరాల కోసం రూ.31.72 లక్షలు, వార్డుల వారీగా పనుల కోసం రూ.31.72 లక్షలు ఖర్చయ్యే అవకాశం ఉందని బడ్జెట్ నివేదికలో లెక్కలు వేశారు.

నేడు బడ్జెట్ సమావేశం
మున్సిపల్ వార్షిక అంచనా బడ్జెట్‌కు సంబంధించి గురువారం కౌన్సిల్ ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నారు. బడ్జెట్‌కు రూపకల్పన చేసిన అధికారులు కౌన్సిల్ ముందుకు తీసుకురానున్నారు. పురపాలికకు వచ్చే ఆదాయం, ఖర్చు, క్యాపిటల్ నిధులు తదితర వివరాలను సభ్యులకు అందించారు.

ఎమ్మెల్యేకు ఆహ్వానం

జనగామ: ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొమురవెల్లిలో నేడు(గురువారం) రైల్వేస్టేషన్ శంకుస్థాపన పనులకు జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డికి ఆహ్వానం వచ్చింది. ఈమేరకు దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఎమ్మెల్యేకు ఆహ్వానం పలికారు. కాగా.. కొమురవెల్లి రైల్వేస్టేషన్ శంకుస్థాపన కార్యక్రమానికి బీఆర్ఎస్, కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున తరలి వెళ్లనున్నారు.

ముగిసిన ఈవీఎంల మొదటి దశ తనిఖీ

జనగామ: కలెక్టరేట్ ప్రాంగణంలోని ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ గోడౌన్‌లో ఈవీఎం యంత్రాల మొదటి దశ తనిఖీ ప్రక్రియ బుధవారం ముగిసింది. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సీహెచ్.శివలింగయ్య అదనపు కలెక్టర్ పింకేశ్ కుమార్‌తో కలిసి పరిశీలించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈవీఎంల మొదటి దశ ప్రక్రియను వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో తనిఖీ చేసినట్లు కలెక్టర్ తెలిపారు. 1,366 ఈవీఎం బ్యాలెట్ యూనిట్లు, 1,122 కంట్రోల్ యూనిట్లు, 1,297 వీవీ ప్యాట్ల మొదటి దశ తనిఖీ పూర్తి చేసినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుహాసిని, వివిధ పార్టీల ప్రతినిధులు రావెల రవి, విజయ్‌భాస్కర్, సీహెచ్.శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్, అజయ్, ప్రకాశ్, కుమార్ సాంకేతిక నిపుణులు, ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


తనిఖీ ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్ శివలింగయ్య

భూమిని పేదలకు పంచాలి

జనగామ: బచ్చన్నపేట మండలం చిన్నరామన్‌చర్ల శివారు గోపాల్‌నగర్ గ్రామ పంచాయతీ పరిధి 174 సర్వే నంబర్‌లోని ప్రభుత్వ అసైన్డ్ భూమిని పేదలకు పంచాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి డిమాండ్ చేశారు. సీపీఎం కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం వెంటనే ఈ భూమిని పూర్తిగా ఆధీనంలోకి తీసుకుని, అర్హులైన పేద కుటుంబాలకు పంపిణీ చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రాపర్తి రాజు, సాంబరాజు యాదగిరి, బూడిద గోపి, జోగు ప్రకాశ్, సుంచు విజేందర్, బెల్లంకొండ వెంకటేశ్, నాయకులు కళ్యాణ లింగం, పర్వతం నరసింహులు, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మోకు కనకారెడ్డి

బాధ్యతల స్వీకరణ

జనగామ: జనగామ ఏసీపీగా ఎస్ఆర్ దామోదర్ రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. హైదరాబాద్ ఎలక్షన్ సెల్‌లో విధులు నిర్వర్తించిన ఆయన.. ఇక్కడికి బదిలీపై వచ్చారు. పట్టణ సీఐ రఘుపతిరెడ్డి, ఎస్‌ఐలు సృజన్, అరుణ్, తిరుపతి, శ్వేత ఏసీపీని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

మున్సిపల్ కమిషనర్..
జనగామ మున్సిపల్ కమిషనర్‌గా వెంకటేశ్వర్లు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందించారు. కార్యాలయ డీఈ చంద్రమౌళి, మేనేజర్ రాములు, ఏఈ మహిపాల్, ఉద్యోగులు, సిబ్బంది నూతన కమిషనర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు.


ఏసీపీని కలిసిన సీఐ, ఎస్సైలు

జెడ్పీ డిప్యూటీ సీఈఓ..
జనగామ జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓగా డి.సరిత బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం పని చేస్తున్న వసంత వికారాబాద్‌కు బదిలీ కాగా.. మేడ్చల్‌లో విధులు నిర్వర్తిస్తున్న సరిత బదిలీపై ఇక్కడికి వచ్చారు. అనంతరం జెడ్పీ సీఈఓ అనిల్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. కాగా.. కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది సరితను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.


మున్సిపల్ కమిషనర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తూ..


జెడ్పీ సీఈఓకు పుష్పగుచ్ఛం అందిస్తున్న సరిత

తోరణం కట్టిన అనంతరం ధూపం, శాక, నీళ్లు ఆరగింపు చేస్తున్న పూజారులు



మండమెలిగె.. తల్లులు మురిసె

- మహా ఘట్టం ఆరంభం
- ఆదివాసీ సంప్రదాయం ప్రకారం ప్రత్యేక పూజలు
- మేడారం, కన్నెపల్లిలో ఆలయాల శుద్ధి


సమ్మక్క గుడి వద్ద పూజలు చేస్తున్న పూజారులు

పుట్ట మట్టి తెచ్చి పూజలు చేసి.. శ్రద్ధతో ఆలయాల్ని శుద్ధి చేసి.. డోలు చప్పుళ్లతో పసుపు, కుంకుమను తీసుకొచ్చి.. నిష్టతో అమ్మవార్లకు నీళ్లారగించి.. కల్లు సాక పోసి.. కట్నకానుకలు సమర్పించి.. కోడి పిల్ల కట్టి.. దిష్టిని దులిపేసి అడవి తల్లులకు పూజలు చేశారు. మండమెలిగె కార్యక్రమంతో మేడారం మహా జాతర ఘట్టాన్ని ఆరంభించారు. బుధవారం మేడారానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తజనంతో మేడారం పరిసరాలు సందడిగా మారాయి. ముందుగా జంపన్నవాగులో స్నానాలు ఆచరించి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఎత్తు బెల్లం సమర్పించి మొక్కు తీర్చుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. - ఎస్ఎస్ తాడ్వాయి

- వివరాలు 8లో▸


విద్యుత్ పనుల పరిశీలన

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని ఇప్పగూడెం, రంగరాయగూడెం, అక్కపెల్లిగూడెం, కోమటిగూడెం గ్రామాల పరిధి శ్రీ చింతగట్టు సమ్మక్క–సారలమ్మ జాతర ప్రాంగణంలో జరుగుతున్న ఎలక్ట్రిసిటీ పనుల్ని ఎన్పీడీసీఎల్ డీఈ ఎం.హుస్సేన్‌నాయక్ బుధవారం పరిశీలించారు. ముందుగా.. ఇప్పగూడెం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో విద్యుత్ సరఫరా చేసే ఫీడర్లను పరిశీలించారు. జాతర ప్రాంగణంలో చేపడుతున్న పనులు పర్యవేక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పనుల్ని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో శివునిపల్లి ఏఈ శివకుమార్, కమర్షియల్ ఏఈ బి.నాగలక్ష్మి, లైన్‌మన్‌లు కాల్‌రామ్, సాయిబాబా, జేఎల్‌ఎం సురేందర్, జాతర ఉత్సవ కమిటీ బాధ్యులు జూలుకుంట్ల శిరీశ్‌రెడ్డి, మందపురం ఎల్లగౌడ్, విద్యుత్ సిబ్బంది ఉన్నారు.


పరిశీలిస్తున్న డీఈ హుస్సేన్‌నాయక్

కిడ్నాప్ వదంతులు

లింగాలఘణపురం: పిల్లలను ఎత్తుకెళ్లే ముఠా సంచరిస్తోందని కొద్ది రోజులుగా సోషల్ మీడియాలో ఫొటోలు, వీడియోలు వైరల్ అవుతున్నాయి. బుధవారం తరిగొప్పుల నెల్లుట్ల గ్రామంలో తిరుగుతున్న బొంతగట్టు నాగారానికి చెందిన ఏకూర్ల కేతమ్మను కిడ్నాపర్‌గా భావించిన గ్రామస్తులు పోలీసులకు సమాచారమిచ్చారు. ఎస్సై ప్రవీణ్ గ్రామానికి చేరుకొని ఆమె వద్ద ఉన్న బుక్‌లోని నంబర్లకు ఫోన్ చేశాడు. ఆమె సోదరుడు వచ్చి కేతమ్మను తీసుకెళ్లాడు. కాగా.. నలుగురు తమ గ్రామానికి వచ్చారని అందులో ఒకరిని గ్రామస్తులు పట్టుకొని పోలీసులకు అప్పగించినట్లు సోషల్ మీడియాలో ప్రచారం చేశారు. ఎస్సై ప్రవీణ్ మాట్లాడుతూ.. రాలేదని, పుకార్లు పట్టించుకోవద్దన్నారు.



మేడారంలో 'స్మార్ట్' సేవలు!

ఆన్‌లైన్‌లో భక్తులు 'నిలువెత్తు' బంగారం సమర్పణ

- ఈసారి సమ్మక్క, సారలమ్మ జాతరలో నూతన ఒరవడి
- గతంలోనే ఈ–హుండీల ఏర్పాటు
- ఈసారి ఆన్‌లైన్ బంగారం సమర్పణ, ప్రసాదం సేవలు
- ఇప్పటికే సేవలను వినియోగించుకున్న సీఎం, మంత్రులు కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి
- మీసేవ, పోస్టాఫీస్, టీయాప్ ఫోలియాద్వారా సేవలు అందుబాటులోకి..

(వరంగల్ డెస్క్)

తెలంగాణ కుంభమేళా, ఆసియాలోనే అతిపెద్ద గిరిజన, ఆదివాసీ జాతర అయిన మేడారంలో ఈ ఏడాది కొత్తగా 'స్మార్ట్' సేవలకు అడుగులు పడ్డాయి. భక్తజనంతో ఇసుకేస్తే రాలనంత జనం ఉండే ఈ సమ్మక్క సారలమ్మ జాతరకు వెళ్లలేని భక్తులకు సదావకాశం కల్పించారు. ఇంటినుంచే నిలువెత్తు బంగారం (బెల్లం) సమర్పించే అవకాశాన్ని రాష్ట్ర దేవాదాయ శాఖ కల్పించింది. భక్తులు మీసేవ, పోస్టాఫీసు, టీయాప్ ఫోలియో ద్వారా బుక్ చేసి నగదు చెల్లిస్తే అమ్మవార్లకు నిలువెత్తు బంగారం సమర్పించి, మొక్కులు చెల్లించుకోవచ్చు. అమ్మవార్ల ప్రసాదం కావాలన్నా ఆన్‌లైన్‌లో బుక్ చేసుకునే సదుపాయం కల్పించారు. ఆన్‌లైన్ ద్వారా నగదు చెల్లిస్తే ఆ బెల్లం(బంగారాన్ని) మేడారంలోని ఎండోమెంట్ అధికారులు వనదేవతలకు సమర్పిస్తారు. ఇలా సమర్పించిన తర్వాత మళ్లీ కొంత నగదు చెల్లించి పోస్టల్‌శాఖ ద్వారా బంగారం ప్రసాదాన్ని పొందే వెసులుబాటు కల్పించారు.

ఆన్‌లైన్ సేవలపై ముమ్మర ప్రచారం
రెండేళ్లకోసారి మాఘమాసంలో (ఈ నెల 21 నుంచి 24 వరకు) నిర్వహించే మేడారం జాతరలో ఈసారి అందిస్తున్న ఆన్‌లైన్ సేవలపై దేవాదాయశాఖ అధికారులు విస్తృత ప్రచారం కల్పిస్తున్నారు. మంత్రులు, జిల్లా అధికారులు సైతం ఆన్‌లైన్ బంగారం సమర్పణపై ఇప్పటికే ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ఈ వేడుకకు ఏపీ, తెలంగాణతోపాటు ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, ఒడిశా, ఝార్ఖండ్ రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తారు. కోటిన్నర మంది సందర్శించుకునే సమ్మక్క సారలమ్మ జాతరకు అధికారులు ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నారు.



ఆన్‌లైన్‌లో సమర్పించేందుకు ఏర్పాటు చేసిన మీసేవ వెబ్‌సైట్

ఇలా బుక్ చేయాలి..
భక్తులు వారి బరువు ఒక కేజీకి రూ.60 చొప్పున చెల్లించాల్సిఉంటుంది. బంగారం సమర్పించే భక్తుడి బరువు అనుగుణంగా నగదు చెల్లించాలి. ఇందుకోసం మీ దగ్గరిలోని మీ సేవకు వెళ్లి ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవాలని అధికారులు సూచించారు. నిలువెత్తు బంగారం సమర్పించేందుకు ఓ వ్యక్తి 50 కేజీలు ఉంటే బరువు ప్రకారం రూ.3,000, మీ సేవా చార్జీలు రూ.35, పోస్టల్ చార్జీలు (తిరిగి బంగారం ప్రసాదం కావాలనుకుంటే) రూ.100 కలిసి మొత్తంగా రూ.3,135 చెల్లించాల్సి ఉంటుందని దేవాదాయశాఖ వర్గాలు తెలిపాయి. మీ సేవలో దేవాదాయ శాఖ వెబ్‌సైట్‌లో శ్రీ మేడారం సమ్మక్క, సారలమ్మ జాతర బంగారం సేవ, శ్రీ సమ్మక్క, సారలమ్మ జాతర ప్రసాదం అని రెండు ఆప్షన్లు ఇచ్చారు. బంగారం సమర్పించేవారు బంగారం సేవలో వివరాలు నమోదు చేయాలి. మన పేరుతోపాటు అడ్రస్, ఫోన్‌నంబర్, భక్తుడి నక్షత్రం, బరువు ఇతర వివరాలన్నీ నమోదు చేయాలి.

ఇప్పటికే పలువురు ప్రముఖుల సమర్పణ
మేడారం జాతర ఆన్‌లైన్ సేవలు, ఇంటినుంచే నిలువెత్తు బంగారం సమర్పణ సేవలను మంత్రి కొండా సురేఖ ఈ నెల 7న తన మనుమడి పేరుతో ప్రారంభించారు. ఆర్టీసీ డిపార్ట్‌మెంట్ ద్వారా ప్రసాదం సైతం పొందే సౌకర్యాన్ని అందుబాటులోకి తెచ్చారు. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి తన మనుమడి పేర బంగారం సమర్పించారు. అదేవిధంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కూడా ఆన్‌లైన్‌లోనే నిలువెత్తు బంగారం సమర్పించారు.

ఆన్‌లైన్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి



మేడారం జాతరలో ఈ ఏడాది కొత్తగా అందిస్తు న్న ఆన్‌లైన్‌లో బంగారం సమర్పణ, ప్రసాదం సేవలను భక్తులు వినియోగించుకోవాలి. దూరభారం, వయోభారం, చిన్నపిల్ల ల మొక్కులున్న వారికి ఈ సేవలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి. భక్తుడు నిలువెత్తు బంగారం సమర్పించాలంటే వారు మీ సేవలో ఎత్తు (తూకం)సరిపోయే ఖరీదును చెల్లించాల్సి ఉంటుంది. ఆ డబ్బులు జాతర అకౌంట్‌లో నమోదవుతాయి. వివరాల ఆధారంగా ఆ భక్తుడి పేరుపై ప్రత్యేక పూజలు, ఎత్తు బంగారం సమర్పిస్తాం. ప్రసాదం కావాలన్నా ఆర్టీసీ కొరియర్ సేవల ద్వారా అందిస్తున్నాం. ఆర్టీసీ, దేవాదాయ శాఖ సమన్వయంతో పంపుతున్నాం.

– రాజేంద్రం, మేడారం ఈఓ

క్లుప్తంగా

జంట హత్యల కేసులో నిందితుడి అరెస్టు



కుమారస్వామి అరెస్టు చూపుతున్న సీఐ ఫణిధర్, ఎస్సై రాణాప్రతాప్

గూడూరు: తల్లీకొడుకుల హత్య కేసులో నిందితుడు శివరాత్రి కుమారస్వామిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తునట్లు సీఐ ఫణిధర్ తెలిపారు. మండల కేంద్రంలోని సర్కిల్ పోలీసు స్టేషన్‌లో బుధవారం కుమారస్వామి అరెస్టు చూపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మంగళవారం మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై బొల్లెపల్లికి చెందిన ఆలకుంట సమ్మక్క, ఆమె కుమారుడు సమ్మయ్యను కుమారస్వామి దారుణంగా ఇనుపరాడ్‌తో కొట్టి చంపారన్నారు. ఈ కేసులో నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎస్సై రాణాప్రతాప్ పాల్గొన్నారు.

మానసిక దివ్యాంగురాలిపై లైంగికదాడి

- యువకుడి అరెస్టు, రిమాండ్



నిందితుడి అరెస్టు చూపుతున్న సీఐ

రేగొండ: మండలంలోని రేపాక గ్రామానికి చెందిన మానసిక దివ్యాంగురాలిపై లైంగికదాడికి పాల్పడిన యువకుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై రవికుమార్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన పొరండ్ల రాము మంగళవారం సాయంత్ర అదే గ్రామానికి చెందిన మానసిక దివ్యాంగురాలిని తన ఇంటికి పిలుచుకుని లైంగికదాడికి పాల్పడ్డాడు. ఈ సమయంలో బాధితురాలు కేకలు వేయడంతో తల్లిదండ్రులు వచ్చి చూడగా నిందితుడు పారిపోయాడు. ఈ ఘటనపై బాధితురాలి తల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. చిట్యాల సీఐ వేణు చందర్ ఆదేశాల మేరకు బృందాలుగా ఏర్పడి నిందితుడిని పట్టుకుని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై బుధవారం తెలిపారు.

పరకాలలో చోరీ

- రూ.5లక్షల విలువైన వెండి, బంగారు ఆభరణాల అపహరణ

పరకాల: పరకాల పట్టణం నగర వీధిలోని ఓ ఇంట్లో మంగళవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. నగరవీధిలో వీడియో మిక్సింగ్ యూనిట్ నడిపిస్తున్న అనంతుల ఉమా మహేశ్వర్ తల్లిదండ్రులు ఆరునెలల క్రితం మృతి చెందారు. సిద్ధాంతి సూచనల మేరకు ఉమా మహేశ్వర్ సొంతింటిని వదిలి కొద్ది రోజుల నుంచి అద్దెకు ఉంటున్నాడు. అయితే ఇంట్లో పూజ గదిలో, బీరువాలో ఉన్న వెండి విగ్రహాలు, ఇతర ఆభరణాలను తీసుకెళ్లలేదు. ఈ క్రమంలో దుండగులు ఇంట్లోకి చోరీకి పాల్పడి రూ.5 లక్షల విలువైన వెండి, బంగారు ఆభరణాలు అపహరించారు. ఈ విషయం తెలుసుకున్న ఉమామహేశ్వర్ పోలీసులకు సమాచారం అందించాడు. దీంతో సీఐ అబ్బయ్య, ఎస్సై శివకృష్ణ ఆధ్వర్యంలో క్లూస్ టీం ఆధారాలు సేకరించింది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



డోలు వాయిద్యాల నడుమ సమ్మక్క గుడికి వెళ్తున్న పూజారులు



తోరణానికి కోడి, సొరకాయ, మిరపకాయ కట్టిన పూజారులు



జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు



జంపన్నవాగులో మొక్కుతున్న భక్తులు

మండమెలిగె.. తల్లులు మురిసె

ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాల ప్రకారం ప్రత్యేక పూజలు

- మేడారం, కన్నెపల్లిలో ఘనంగా ఆలయాల శుద్ధి కార్యక్రమాలు
- మండమెలిగెతో మహాజాతర పూజలు మొదలు



సమ్మక్క, సారలమ్మ గద్దెల వద్ద భక్తులు

ఎస్‌ఎస్ తాడ్వాయి : మేడారం మహాజాతరలో భాగంగా నిర్వహించే క్రతువుల్లో మరో ప్రధాన ఘట్టానికి అంకురార్పణ జరిగింది. బుధవారం మేడారం, కన్నెపల్లిలో ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయ ప్రకారం పూజారులు మండమెలిగె పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూజారులు ఉదయమే తలస్నానాలు ఆచరించి నూతన వస్త్రాలు ధరించారు. అనంతరం అమ్మవార్ల ఆలయాల శుద్ధి చేశారు. దీంతో మండమెలిగె కార్యక్రమాలతో జాతర ప్రారంభమైనట్లు ఆదివాసీలు, భక్తులు భావిస్తారు.

మేడారం సమ్మక్క గుడిలో..

మేడారం సమ్మక్క ఆలయంలో పూజారులు గుడి శుద్ధి కార్యక్రమాలతో పూజ తంతు ప్రారంభించారు. అమ్మవార్ల శక్తి పీఠాన్ని పవిత్రమైన పుట్ట మట్టితో అలికారు. సమ్మక్క ప్రధాన పూజారి మునీందర్ ఇంటి నుంచి పసుపు, కుంకుమలు తీసుకుని డోలు వాయిద్యాల నడుమ పూజారులు, ఆడపడుచులు గుడికి చేరుకున్నారు. గుడిలో అమ్మవారి శక్తి పీఠానికి ముగ్గులు వేసి అలకరించారు. అనంతరం పూజారులు డోలు వాయిద్యాలతో పోచమ్మ, గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. మామిడి తోరణాలతో సమ్మక్క గుడికి చేరుకుని మరోసారి పూజలు నిర్వహించి, సమ్మక్క ప్రధాన ద్వారం (ఐలాండ్ ప్రాంతం)లో తూర్పు ప్రవేశ మార్గంలో బురుగ కర్రలకు పసుపు, కుంకుమ అద్దారు. మామిడి తోరణానికి సొరకాయ, కోడిపిల్ల కట్టి బురుగ కర్రలకు తోరణాన్ని కట్టి ధ్వజస్తంభ తోరణం (దిష్టి తగలకుండా) నిలిపారు. సమ్మక్క పూజారులు మునీందర్, మల్లెల ముత్తయ్య, కొక్కెర కృష్ణయ్య, దశరథం, దూప వడ్డె నాగేశ్వర్‌రావు.. చలిగంజి, కోడి, శాక (కల్లు), దూపంతో మూడు దఫాలు తోరణం కింద రోడ్డు అడ్డంగా అరగింపు చేశారు. పడమర ప్రవేశ మార్గంలో కూడా ఇదే తీరు పూజలు నిర్వహించారు. అనంతరం సమ్మక్క గుడి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఈ కార్యక్రమంలో పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్ధబోయిన జగ్గారావు, పూజారులు పాల్గొన్నారు. కాగా పస్రా సీఐ శంకర్, తాడ్వాయి ఎస్సై శ్రీకాంత్ రెడ్డి.. బందోబస్తు నిర్వహించారు.

మేడారం ముచ్చట్లు

కన్నెపల్లిలో..

కన్నెపల్లిలోని సారలమ్మ గుడిలో మండమెలిగే పూజా కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. సారలమ్మ ప్రధాన పూజారి కాక సారయ్య, పూజారులు కాక కిరణ్‌తో పాటు మరికొంత మంది గుడితో పాటు సారలమ్మ వస్త్రాలు, గంటలు, కొమ్ములను శుద్ధి చేశారు. ఆడపడుచులు ముగ్గులతో అలకరించారు. సారలమ్మ వడెరాల కుండలను కూడా పసుపు, కుంకుమ రాసి అలంకరించారు. అనంతరం సారలమ్మకు ధూప, దీపాలు వెలిగించి పూజలు నిర్వహించారు.



మేక జిడ్డి ఇవ్వాలని మొక్కుతున్న భక్తులు



క్యూలైన్‌లో రావాలని భక్తులను కోరుతున్న ఎస్సై

రాత్రికి పూజారుల జాగారం..

మేడారంలోని సమ్మక్క గుడి నుంచి పూజారులు రాత్రి సమయంలో అమ్మవారి పూజ సామగ్రి, పసుపు, కుంకుమ, కంకణాలను తీసుకుని డోలు వాయిద్యాల నడుమ గద్దెలకు చేరుకుంటారు. సమ్మక్క గద్దె వద్ద అలికి ముగ్గులు వేసి పసుపు, కుంకుమ, పూజ సామగ్రిని గద్దెపై ఉంచుతారు. కన్నెపల్లి నుంచి కూడా సారలమ్మ పూజారులు మేడారంలోని గద్దెలకు చేరుకుంటారు. వారు కూడా గద్దెలపై పూజ కార్యక్రమాలు నిర్వహిస్తారు. సమ్మక్క, సారలమ్మ పూజారులు ఆనవాయితీగా ఒక్కరికొక్కరు శాక (కల్లు) ఇచ్చిపుచ్చుకుంటారు. బుధవారం రాత్రి జాగారం ఉంటూ గద్దెల ప్రాంగణంలో డోలు వాయిద్యాలతో సంబురాలు చేసుకుంటారు. అనంతరం గురువారం ఉదయం గద్దెలపై ఉంచిన అమ్మవార్ల పూజా సామగ్రితో తిరిగి పూజారులు మేడారం, కన్నెపల్లిలోని అలయాలకు చేరుకుని స్నానాలు ఆచరించి పూజలు నిర్వహిస్తారు. దీంతో మండమెలిగె పూజా కార్యక్రమాలు ముగుస్తాయి.



షవర్ల వద్ద స్నానాలు చేస్తున్న యువతులు

భక్తుల సందడి..

- భారీగా తరలివచ్చి మొక్కుల చెల్లింపు

మేడారం సమ్మక్క- సారలమ్మ దర్శనానికి భక్తులు భారీగా తరలివచ్చారు. బుధవారం మండమెలిగె పండుగను పురస్కరించుకొని రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు మేడారానికి తరలివచ్చారు. జంపన్నవాగు వద్ద భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. శివసత్తులు పూనకాలతో ఊగిపోయారు. అనంతరం అమ్మవార్ల గద్దెల వద్దకు చేరుకొని పసుపు, కుంకుమ, పూలు, పండ్లు, చీరసారె, ఎత్తు బంగారం, కానుకలు, కోళ్లు, యాటలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. గోవిందరాజు, పగిడిద్దరాజులకు కూడా పూజలు చేశారు. భక్తుల తాకిడి పెరగడంతో పోలీసులు క్యూలైన్ల ద్వారా భక్తులను దర్శనానికి పంపించారు. సుమారు 50 వేల మందికి పైగా భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నట్లు అధికారులు అంచనా వేశారు. ఇటు భక్తుల రద్దీ, అటు మండమెలిగె పండుగ పూజా సంబురాలతో మహాజాతర భక్తజనంతో కిక్కిరిసి పోయింది. మొక్కుల అనంతరం భక్తులు వంటావార్పు చేసుకొని సహపంక్తి భోజనాలు చేశారు.

అల్లుడిని కడతేర్చిన మామ

- రంగశాయిపేటలో దారుణ హత్య
- మృతుడు రౌడీషీటర్‌గా గుర్తింపు
- పోలీసులకు లొంగిపోయిన మామ
- వేధింపులు తాళలేక ఘాతుకం



దుట్టా శ్రీనివాస్ (ఫైల్)

ఖిలా వరంగల్: వేధింపులు తాళలేక అల్లుడిని మామ కడతేర్చాడు. కళ్లలో కారం చల్లి గోడకు మోదీ దారుణంగా హత్య చేశాడు. ఈ ఘటన నగరంలో సంచలనం సృష్టించింది. పోలీసుల కథనం ప్రకారం.. వరంగల్ రంగంపేట కేఎంసీ ప్రాంతానికి చెందిన దుట్టా శ్రీనివాస్ (29) కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అతడిపై మట్టెవాడ పోలీస్ స్టేషన్‌లో రౌడీషీట్ నమోదై ఉంది. ఈ క్రమంలో శ్రీనివాస్‌కు తొమ్మిదేళ్ల క్రితం వరంగల్ ఉర్సు రోడ్డు రంగశాయిపేటలోని ఆదర్శనగర్ కాలనీకి చెందిన బజ్జూరి రమేష్, విజయ దంపతుల కూతురు రమ్యతో వివాహమైంది. వివాహమైన ఆరునెలల నుంచే భార్యను పలు విధాలుగా వేధింపులకు గురిచేసేవాడు. దీంతో రమ్య భర్తను వదిలి 8 ఏళ్లుగా తల్లిగారి ఇంటివద్దే ఉంటోంది. భార్యను కాపురానికి పంపించాలని, లేనిపక్షంలో చంపేస్తానని శ్రీనివాస్ రెండేళ్లుగా అత్తామామలను వేధించడంతో వారు భయాందోళనకు గురై హైదరాబాద్‌కు వెళ్లిపోయారు. ఈ నేపథ్యంలో ఈనెల 11 నుంచి 14వ తేదీ వరకు గ్రామదేవత బొడ్రాయి ప్రతిష్ఠాపన పూజల జరుగుతున్న నేపథ్యంలో తిరిగి వారు తమ ఇంటికి చేరుకున్నారు. ఈ విషయం తెలిసిన శ్రీనివాస్.. మంగళవారం అర్ధరాత్రి మద్యం సేవించి అత్తారింటి ఎదుట దుర్భాషలాడుతూ చిందులేశాడు. దీంతో ఆగ్రహానికి లోనైన మామ ఇక ఎంత కాలం ఈ గొడవ భరించాలంటూ అల్లుడి కళ్లలో కారం చల్లి అతడిని గోడకు మోదీ దారుణంగా హత్య చేశాడు. ఆ తర్వాత నిందితుడు రమేష్ నేరుగా మిల్స్‌కాలనీ పోలీసులకు లొంగిపోయాడు. సమాచారం అందుకున్న ఇన్‌స్పెక్టర్ మల్లయ్య, ఎస్సై వెంకన్న హుటాహుటిన ఘటనా స్థలికి చేరుకుని హత్య జరిగిన తీరును పరిశీలించారు. హత్యకు గల కారణాలను కుటుంబీకులు, స్థానికులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎం తరలించారు. ఈ ఘటనపై మృతుడి తండ్రి వెంకటరమణ ఫిర్యాదు మేరకు బజ్జూరి రమేష్, అతడి కుమార్తె రమ్య, కొడుకు అఖిల్, భార్య విజయపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మల్లయ్య బుధవారం తెలిపారు.

మొదటి మొక్కు రాజన్నకే..

- తర్వాతే సమ్మక్క,సారలమ్మకు..
- ఆనవాయితీగా వస్తున్న ఆచారం

ఏటూరునాగారం: ఆసియాఖండంలోనే అతిపెద్ద గిరిజన జాతరైన మేడారం సమ్మక్క, సారలమ్మ జాతరకు వచ్చే భక్తులు ముందు వేములవాడ రాజన్నకే మొదటి మొక్కు చెల్లిస్తారు. అనంతరమే తల్లుల సన్నిధికి చేరుకుని మొక్కులు సమర్పిస్తారు. ఈ ఆచారం ఆనవాయితీగా వస్తోంది. వేములవాడ రాజన్నకు గ్రామాల్లో శివసత్తులు జోలెపట్టుకుని బియ్యం సేకరిస్తారు. ఆ తర్వాత బియ్యాన్ని నైవేద్యంగా వండి ఇంట్లోని శివుడి ఫొటో వద్ద ఉంచి మనసారా మొక్కులు చెల్లిస్తారు. ఆ తర్వాత ఇంట్లోకి ఐదుగురు పార్వతులను (మహిళలు) ఆహ్వానించి కుడక, పోక, ఖర్జూర, రవికముక్కను అందజేసి ఒడి బియ్యం సమర్పిస్తారు. ఇంట్లో ఉన్న దేవతల ఫొటోల వద్ద కొబ్బరికాయలు కొట్టి ఆ తర్వాత వేములవాడకు పయణమవుతారు. అక్కడ రాజన్నను దర్శించుకుని కోడెను కడుతారు. కుంకుమ పూజ, ఆకు పూజ, అన్న పూజ.. ఇలా పలు పూజలు చేసి శివపార్వతులకు మొక్కులు, కానుకలు చెల్లిస్తారు. ప్రత్యేకంగా దంపతులు గుండంలో(కోనేరు)లో స్నానమాచరించి తడిబట్టలతో వడివడిగా ఆలయంలోకి వెళ్లి శివుడిని దర్శించుకుంటారు. ఇలా చేయడం శుభ్రప్రదమని వారి విశ్వాసం.



ఇంట్లో సమ్మక్క, సారలమ్మకు పూజలు చేస్తున్న భక్తులు

బద్దిపోశమ్మకు మొక్కులు

వేములవాడ రాజన్నకు మొదటి మొక్కు చెల్లించిన తర్వాత ఆయన కుమార్తె బద్దిపోశమ్మకు వడిబియ్యం, కోళ్లు, మేకలు, బోనం సమర్పిస్తారు. బెల్లం శాఖ, కల్లును ఆరబోస్తారు. ఇలా అక్కడ ప్రత్యేక పూజలు చేసిన తర్వాత ఇంటికి చేరుకుంటారు.

వనదేవతలకు మొక్కులు

వేములవాడకు వెళ్లి వచ్చిన భక్తులు బుధ, ఆదివారాల్లో మేడారం సమ్మక్క, సారలమ్మ వద్దకు చేరుకుని అటవీ ప్రాంతంలో బస చేసి అక్కడే అమ్మవారి ప్రతిరూపంగా చెట్టుకు బొట్టు పెట్టి, బంగారం (బెల్లం) నైవేద్యంగా సమర్పిస్తారు. ఆ తర్వాత కోళ్లు, మేకలను అమ్మవారికి బలిచ్చి వంటలు చేసుకుని సంపక్తిభోజనాలు చేస్తారు. కొంత మంది భక్తులు మేకపోతులు, కోళ్లను గద్దెల వద్దకు తీసుకెళ్లి బలిస్తారు. అంతేకాకుండా అమ్మవారికి నిలువెత్తు బంగారం సమర్పిస్తారు.

వేములవాడకు 50 ఏళ్ల నుంచి వెళ్తున్న



“ వేములవాడ రాజన్న దేవాలయానికి 50 ఏళ్ల నుంచి వెళ్తున్న. శివపార్వతిగా ఉంటూ మేడారం జాతరకు కూడా పోయి వస్తున్నా. ఇలా చేయడం వల్ల పిల్లాపాపలు, కుటుంబం సల్లంగా ఉంటుంది. శివపార్వతిగా ఉంటున్న వారిని ప్రజలు ఆదరిస్తున్నారు. మేడారం జాతర ముందు వేములవాడకు వెళ్లిరావడం ఆనవాయితీగా వస్తోంది.

-గాజుల కొమురమ్మ, శివసత్తు, ఏటూరునాగారం

వ్యాన్ ఢీకొని వ్యక్తి మృతి

- దశదిన కర్మ కు వెళ్లి వస్తుండగా ఘటన..
- మృతుడిది భద్రాద్రి కొత్తగూడెం జిల్లా



శ్రీనివాస్(ఫైల్)

మహబూబాబాద్ రూరల్ : వ్యాన్ ఢీకొని ఓవ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన బుధవారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో జరిగింది. టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ కథనం ప్రకారం...భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గుండాల మండలం శంభునిగూడెం గ్రామానికి చెందిన కుంజ శ్రీనివాస్ (34), అతడి భార్య శ్రీలత, అత్త భద్రమ్మ, నాయనమ్మ పాపమ్మ, కుమారుడు సాత్విక్, కుమార్తె ఆకాంక్ష, బంధువులు మనోజ్, చరణ్, రాధ.. కేసముద్రం మండలంలోని బెరువాడలోని బంధువుల ఇంట్లో జరిగిన దశదిన కర్మ కు హాజరయ్యారు. తిరుగు ప్రయాణంలో ఓ ఆటోలో మహబూబాబాద్ వస్తున్నారు. ఈ క్రమంలో జిల్లా కేంద్రంలోని పంచాయతీ రాజ్ శాఖ కార్యాలయం సమీపంలో మారుతి ఓమ్ని వ్యాన్ వెనుక నుంచి ఆటోను ఢీకొంది. దీంతో ఆటోలో ఎడమ వైపున కూర్చున్న శ్రీనివాస్ కిందపడ్డాడు. ఈక్రమంలో వెనుక నుంచి వచ్చిన వ్యాన్.. శ్రీనివాస్ పైనుంచి వెళ్లడంతో తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన బంధువులు 108లో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ ఘటనపై శ్రీలత ఫిర్యాదు మేరకు ప్రమాదానికి కారణమైన వరంగల్ రూరల్ జిల్లా సంగెం మండలానికి చెందిన వ్యాన్ డ్రైవర్ బానోత్ సందీప్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు సీఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు..

దోర్నకల్: విద్యుదాఘాతంతో ఓ రైతు మృతి చెందాడు. ఈ ఘటన బుధవారం డోర్నకల్ మండలం రాము తండా జీపీ పరిధిలోని లకావత్ తండాలో జరిగింది. తండాకు చెందిన మాజీ ఉప సర్పంచ్ లకావత్ సోమ్లా(59) తన వ్యవసాయ భూమి వద్దకు వెళ్లాడు. అక్కడ ఫెన్సింగ్ వైర్ తగలడంతో విద్యుత్ సరఫరా అయి అక్కడికక్కడే మృతి చెందాడు. సమీపంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి వ్యవసాయ బావికి విద్యుత్ కనెక్షన్ కోసం వైర్ అమర్చాడు.ఈ క్రమంలో ఎండవేడిమికి పైపుపై ఫైబర్ కరిగి ఫెన్సింగ్ తీగ సోమ్లాకు తగిలింది. దీంతో విద్యుత్ సరఫరా అయి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కూతురు ఉంది.

ఏసీబీలో లీకువీరులు?

- ఆ కార్యాలయం అంటే వారికి భయమేనా..
- ఇటీవల ఓ ఆపరేషన్ ఫెయిల్‌పై విమర్శలు
- అవినీతి అధికారిని తప్పించారా.. తప్పించుకున్నాడా…?
- వెల్లువెత్తుతున్న విమర్శలు

వరంగల్ క్రైం: అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ).. ఈ పేరు వింటే అమ్యామ్యాలకు పాల్పడే ప్రభుత్వ అధికారులు, సిబ్బంది గుండెల్లో రైళ్లు పరుగులు తీస్తాయి. ఆ పేరులో ఉన్న పవర్ అంత. సామాన్యులు సహితం ఆ పేరును బ్రహ్మాస్త్రం లాగా భావిస్తారు. కానీ ఆ శాఖలో పనిచేస్తున్న కొంతమంది చేతివాట వల్ల ప్రతిష్ట దిగజారుతోంది. గోప్యంగా ఉండాల్సిన సమాచారం బయటకు వెళ్తోంది. అవినీతి అధికారులకు ఆయువుగా మారుతోంది. విశ్వసనీయంగా వస్తున్న సమాచారాన్ని కొన్ని శాఖల అధికారులకు చేరవేసి లక్షల రూపాయలు దండుకుంటున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఇటీవల ఒక నెలలోనే ఇద్దరు అవినీతి అధికారులను వల పన్ని పట్టుకున్న చరిత్ర ఏసీబీ అధికారులది. కానీ ఆ శాఖలో కూడా అవినీతి లీకు వీరులు ఉన్నారనే విషయం ఇటీవల ఓ ఆపరేషన్ ఫెయిల్ కావడంతో వెలుగు చూసింది. రిజిస్ట్రేషన్ వంటి శాఖలో అవినీతి అధికారులు ఉన్నప్పటికీ ఎందుకు పట్టుబడటం లేదో ఆ.. ఆపరేషన్ ఫెయిల్ కావడంతో తేటతెల్లమైంది.

లీకు వీరులనుంచేనా..?

ములుగు జిల్లా పరిధిలోని ఓ మండలానికి చెందిన ఓ వ్యక్తి స్టాంప్ వెండర్‌కు అవసరమైన అన్ని అర్హతలు ఉన్నాయి. అతను జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో స్టాంప్ వెండర్ అనుమతి కోసం దరఖాస్తు చేసుకున్నాడు. కానీ సదరు సెక్షన్ అధికారి పనిచేయకుండా సంవత్సర కాలం తిప్పాడు. విసిగివేసారిన ఆ వ్యక్తి ఏసీబీ అధికారులను సంప్రదించాడు. ఏసీబీలో పనిచేస్తున్న ఓ ఇన్‌స్పెక్టర్ బాధితుడినుంచి వివరాలు అడిగి తెలుసుకున్నాడు. బాధితుడితో రిజిస్ట్రేషన్ కార్యాలయ సదరు సెక్షన్ అధికారితో ఫోన్‌లో మాట్లాడించి రికార్డు సైతం చేశాడు. ఆ అధికారి ఎలాంటి భయం లేకుండా 'రూ.20వేలు ఇస్తే నీ పని అవుతుంది' అని తెల్చి చెప్పాడు. ఈ విషయం ఫోన్‌లోనూ రికార్డు అయ్యింది. ఆ తరువాత ఏసీబీ అధికారి సదరు అవినీతి అధికారిని పట్టుకోవటానికి ప్లాన్ వేశాడు. ఆ ప్లాన్ ప్రకారం ములుగు నుంచి హనుమకొండ బస్టాండ్‌లో బస్సు దిగిన బాధితుడు (స్టాంప్‌వెండర్ అనుమతికి దరఖాస్తు చేసుకున్న వ్యక్తి) తనవెంట తెచ్చుకున్న డబ్బులకు ఏసీబీ అధికారులు రసాయనాలు కలిపి ఇచ్చారు. అందరూ కలిసి రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళ్లారు. ముందుగా అనుకున్న ప్రకారం బాధితుడు రిజిస్ట్రేషన్ మొదటి అంతస్తులో ఉన్న సెక్షన్ అధికారి దగ్గరికి వెళ్లి డబ్బులు ఇవ్వగానే ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకోవాలి. బాధితుడు మొదటి అంతస్తు పైకి ఎక్కి సదరు అధికారికి నమస్కరించాడు. సదరు అధికారి గతంలో వ్యవహరించిన తీరుకు భిన్నంగా మాట్లాడాడు. 'ఏమయ్యా.. ఏమైంది అటే వెళ్లావు.. నీ పని అయ్యింది, ఇదిగో నీ ఫైల్ తీసుకో. నిన్ను ఎప్పుడైనా డబ్బులు అడిగినా..? చెప్పు. పని అయ్యింది కదా వెళ్లు' అంటూ కంగారు కంగారుగా మాట్లాడటంతో అతను ఆశ్చర్యానికి గురయ్యాడు. ప్లాన్ సక్సెస్ కానీ.. ఆపరేషన్ ఎలా ఫెయిల్ అయ్యిందనే విషయం ఎవరికి అంతుబట్టలేదు. సదరు ఏసీబీ అధికారులు సైతం ప్లాన్ ఫెయిల్‌పై ఎలాంటి విచారం వ్యక్తం చేయకపోవడం గమనార్హం.. బాధితుడు ఏసీబీ అధికారులను సంప్రదించిన విషయం కట్టుకున్న భార్యకు కూడా చెప్పలేదు. కానీ సమాచారం ఎలా చేరిందో అంతుపట్టని విషయం. ఏసీబీలో ఉన్న లీకు వీరులు రైడ్ విషయం సదరు అధికారికి చేరవేయడం వల్లే ఆపరేషన్ ఫెయిల్ అయినట్లు సమాచారం. ఇంతకు లీకు చేసింది ఎవరనేది ఆ శాఖలోని వారికే తెలియాలి. ఈ విషయంపై బాధితుడు రాష్ట్ర ఏసీబీ అధికారులకు సైతం ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

ఆ శాఖ అంటే ఏసీబీకి భయమేనా..?

జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయంలో రోజూ వందల రిజిస్ట్రేషన్లు జరుగుతాయి. కోట్ల రూపాయలు చేతులు మారుతాయి. ఏసీబీ అధికారులు సైతం ఈ కార్యాలయం వైపు కన్నెత్తిచూడరనే విమర్శలు లేకపోలేదు. అక్కడ పనిచేస్తున్న ఒక్కరిద్దరి అధికారుల రోజువారీ ఆదాయం రూ.లక్ష దాటుతున్నట్లు సమాచారం. అయినా ఇలాంటి విషయాలు అవినీతి నిరోధక శాఖ అధికారులకు కనిపించకపోవడం గమనార్హం.